# చావాలని లేదురా!

-కట్టా రాంబాబు

అందరికీ ఫోన్లలో న్యూస్ వెళ్లిపోయింది. అంతా రాత్రికల్లా రావచ్చు. ఊళ్లో చాలామంది అక్కడికి అప్పుడే వచ్చి ఉన్నారు సీతారామయ్యగారిని బయటపెట్టి నాలుగుగంటలయింది. డాక్టరయితే ఈవేళో రేపో అంటున్నాడు. అందరికీ కబుర్లు పెట్టమని కూడా చెప్పాడు. సీతారామయ్యగారికి దగ్గర దగ్గరగా తొంభై సంవత్సరాలుంటాయి. ఇంటిముందు షామియానా వేసారు. అక్కడక్కడ కుర్చీలు కూడా వేసి ఉన్నాయి. ఆయన అప్పుడప్పుడు కళ్లు తెరుస్తున్నారు, మళ్లీ మూస్తున్నారు. కళ్లు తెరుచినప్పుడల్లా ఆయనలో ఏదో తపన కనిపిస్తోంది. అటూ ఇటూ చూస్తున్నారు.

సీతారామయ్యగారికి నలుగురు పిల్లలు. ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. అబ్బాయిలిద్దరూ హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అమ్మాయిల్లో ఒకరు వైజాగ్‌లో, మరొకరు మద్రాస్‌లో ఉంటున్నారు అంతా వెంటనే బయలుదేరుతున్నామని కబురందించారు

అప్పటికే సమయం సాయంత్రం అయిదు గంటలు కావస్తోంది. అక్కడికి ఆదినారాయణ గారు చేతి కర్ర సాయంతో నడుచుకుంటూ వచ్చారు.

సీతారామయ్యగారి మంచం పక్కనే వేసి వున్న కుర్చీలో కూర్చున్నారు. వాళ్లిద్దరూ మంచి స్నేహితులు.

ఈయనక్కూడా ఇంచుమించు అంతే వయస్సు వుంటుంది. ఆదినారాయణగారు ఉదయం నుంచీ అక్కడే ఉన్నారు. మధ్యాహ్నం భోజనానికి వెళ్లి కాస్సేపు రెస్టు తీసుకుని వచ్చారు. తనొచ్చినట్లుగా సీతారామయ్యగారి చేతిని నొక్కారు.

ఆయన కళ్లు తెరిచి చూసారు.

"ఒరే నారాయణా! నాకప్పుడే చచ్చిపోవాలని లేదురా'' అన్నారు వణుకుతున్న గొంతుతో.

నీకేం భయం లేదన్నట్లు సైగ చేసారు ఆదినారాయణగారు.

"రాజశేఖరాన్ని జైలు నుంచి విడుదల చేస్తారంటావా?'' అడిగారాయన.

"రోజూ చూస్తున్నాంగా. ఏదో ఒకరోజున విడుదల కాడంటావా? న్యాయం గెలుస్తుందిరా?'' చెప్పాడాయన.

"ఆ బాచిరాజు చాలా దుర్మార్గుడురా. నిజాయితీపరుడైన రాజశేఖరాన్ని ఎన్ని బాధలు పెడుతున్నాడో చూడు''

"అవును. అయినా ఆ కేసును వాళ్ళబ్బాయి రంగనాథ్ చూస్తున్నాడుగా.''

"కొడుక్కంటే అల్లుడు కిశోర్‌కి ఆయన కేసు ఇచ్చి వుంటే బాగుండేదేమో?''

"కానీ ఆయన కొడుకుని మంచి లాయర్‌గా ప్రూవ్ చేయాలనుకున్నారేమో. అందుకే అల్లుడ్ని కాదని కొడుకుని సెలెక్టు చేసారు.''

"ఒరే నారాయణ! ఆయన కూతుళ్లు, కోడళ్లే కాదు, కుటుంబ సభ్యులందరూ ఆయన్ని ఆడిపోసుకోవడం నాకు నచ్చడంలేదురా. రాజశేఖరాన్ని చూస్తుంటే జాలేస్తోంది.''

వాళ్లిద్దరూ దేని గురించి మాట్లాడుకుంటున్నారో వాళ్ల సంగతి తెలిసినవాళ్లకి, చుట్టూ వున్నవాళ్లకి బాగా తెలుసు. చచ్చేముందు కూడా ఈ కబుర్లేనా? అని కొంతమంది చాటుగా నవ్వుకున్నారు కూడా.

"ధర్మా పరిస్థితి కూడా అలాగే వుందిరా. అతడ్ని చూసినా జాలి కలుగుతోంది. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని పోగొట్టుకుని తమ్ముళ్లను పెద్ద చేసాడు. చిన్న వయస్సులోనే అతనికెన్ని కష్టాలో చూడు. చెల్లెలెవరో తెలిసి కూడా కలుసుకోలేని పరిస్థితిలో ఆ అన్నదమ్ములు ఎంత మధన పడుతున్నారో కదా'' సీతారామయ్య గారు అన్నారు బాధగా.

"అవున్రా దేవుడెందుకిలా కొంతమంది జీవితాలతో ఆడుకుంటాడో అర్థంకాదు. అంతెందుకు ఆ రాధ పరిస్థితి చూడు. భర్త చనిపోయాడని తెలియక తన భర్తలాగే ఉన్నతన్ని తన భర్తనుకుని అతనితో జీవితాన్ని పంచుకోవాలనుకుంటోంది. నిజంగా అతను తన భర్త కాదని తెలిసాక ఆ పిల్ల బతుకుతుందంటావా?'' ఆదినారాయణ గారు కూడా బాధపడుతూ అన్నారు.

వాళ్లిద్దరూ ప్రభుత్వ ఉద్యోగాలుచేసి రిట్టైరైన వారే. కలసి ఒకే ఆఫీసులో పని చేసారు. రిట్టైరయ్యాక కొంతకాలం బిజినెస్ చేసాక వయస్సు సహకరించక అది మానేసారు. ఎప్పుడూ ఇంట్లో కదలకుండా కూర్చోవడంతో టీవీలకు అలవాటు పడిపోయారు.

టీవీలో వచ్చే ప్రతీ సీరియల్‌ని వదలకుండా చూసేవారు.

వాటి గురించి కరెంటు పోయినప్పుడు చర్చించుకునేవాళ్లు. వాళ్లు ఎంతగా టీవీలకు అతుక్కుపోయేవారంటే బాత్రూమ్‌కి వెళ్లేటప్పుడు తప్ప మిగతా సమయమంతా టీవీతోనే సరిపోయేది.

భోజనం, టిఫిన్లు వంటివి టీవీ చూస్తూనే చేసేవారు. పవర్ కట్ ఉన్నప్పుడు ఏదైనా కారణంతో కరెంట్ పోయినప్పుడు వారికి పిచ్చెక్కిపోయేది.

ఆదినారాయణగారింట్లో అయితే ఆయనకు టీవీ చూడడం అంతగా కుదిరేదికాదు. ఆయన కొడుకులు, కోడళ్లు, పిల్లలతో ఇల్లంతా గోలగోలగా ఉండేది.

అయినా వాళ్లు ఆయన్ని టీవీ చూడనిచ్చేవారుకాదు. కానీ సీతారామయ్యగారికి ఆ బాధ లేదు.

ఎందుకంటే ఆయన కొడుకులు, కూతుళ్లు దూరంగా వుంటున్నారు. ఆయన భార్య పోయి చాలాకాలమైంది.



ఊళ్లో అంతా వాళ్లని టీవీ పిచ్చోళ్లని పిలిచేవారు. టీవీ చూడడం ఇష్టపడేవాళ్లంతా వాళ్లని ఆదర్శంగా తీసుకునేవారు. తమ ఇళ్లల్లో టీవీలు చూడవద్దని గొడవ పెడితే వీళ్లని ఉదాహరణగా చూపేవారు. ఎవరైనా ఏ కారణం చేతనైనా ఓ రోజు సీరియల్ చూడలేకపోతే వీళ్ల దగ్గరకొచ్చి కథ తెలుసుకుని వెళ్లేవారు. వీళ్లు కూడా జరిగింది జరిగినట్లు చెప్పేవారు.

అందుకే ఆ ఊరిలో చాలామందికి సీరియల్స్ మిస్సవుతామేమోనన్న భయం ఉండేదికాదు. ఎవరైనా వూళ్లకు వెళ్లాల్సివచ్చినా, సినిమాలకు వెళ్లాల్సివచ్చినా నిర్భయంగా వెళ్లేవారు. దేవుడు వాళ్లిద్దరికీ మంచి ఆరోగ్యాలిస్తే టీవీలు మాత్రం వాళ్లకి లావుపాటి కళ్లద్దాలు ఇచ్చాయి.

★★★

నాలుగురోజుల నుంచీ సీతారామయ్యగారికి ఏమీ బాగుండడంలేదు. రోజూ డాక్టర్లు వచ్చి చూసి మందులు ఇచ్చేవారు. వయస్సు తొంభై ఏళ్లొచ్చాయి. ఇంక మందులేం పని చేస్తాయి. అదే డాక్టర్ కూడా చెప్పాడు.

పిల్లలు తన దగ్గరకొచ్చి ఉండమంటారుగానీ ఆయన వాళ్ల మాట వినడు. అక్కడికి వెళితే ఇలా టీవీ చూడడం కుదరదని ఆయనకు తెలుసు. అందుకే సొంత ఇంట్లో కాలక్షేపం చేస్తున్నారు. దూరపుబంధువుల ఆవిడను ఒకరిని జీతానికి వంటమనిషిగా కుదుర్చుకున్నాడు.

ఆవిడొచ్చి రోజూ టిఫిన్లు, వంట చేసి పెట్టిపోయేది. ఆయన రోజంతా మంచంమీద పడుకుని రిమోట్ చేతిలో పట్టుకుని అన్ని ఛానల్స్‌లోని సీరియల్స్‌ను చూడడంతోనే సరిపోయేది.

ఆదినారాయణగారు రోజూ ఉదయం టిఫిన్ చేసి వచ్చి సీతారామయ్యగారితోపాటు సీరియల్స్ చూస్తూ కాలక్షేపం చేసేవారు. మంచి ప్రోగ్రామ్స్ లేకపోతే మధ్యాహ్నం ఇంటికి పోయి భోజనం చేసొచ్చేవారు.

ఇంట్లో వాళ్లు కూడా ఈయన సంగతి తెలిసి ఏమీ అనేవారు కాదు. ఈ వయస్సులో ఈయన్ని బాధపెట్టడం దేనికని వూరుకునేవారు.

ఇంట్లోవుంటే ఏదో నస పెడుతుంటారు. అది తప్పుతుందని కూడా ఆయన్ని ఏమీ అనేవారు కాదు.రాత్రి తొమ్మిదింటి సీరియల్స్‌ని ముగించుకుని ఇంటికి వెళ్లేవారు.



ఈ రోజు ఉదయం ఏమయిందో ఆయన కళ్లు తేలేసారు. వంటావిడ కంగారుపడి ఆదినారాయణగారికి కబురు పెట్టింది. ఆయన గబగబా వచ్చి డాక్టర్‌ను పిలిపించారు.

ఆయన పరీక్షించి ఇంక లాభంలేదు, ఏదో టైంలో ప్రాణం పోవచ్చు, బయట పెట్టండని చెప్పాడు. ఇంక చేసేదేంలేక షామియానా తెప్పించి ఇంటి ముందు వేసారు.

దానికింద మంచం వేసి ఆయన్ని పడుకోబెట్టారు. ఎందుకైనా మంచి దని సెలైన్ కట్టారు డాక్టర్‌గారు. బంధువులకు, పిల్లలకు ఆదినారాయణ గారు ఫోన్‌చేసి చెప్పారు.

"ఒరే నారాయణా! నాకప్పుడే చావాలని లేదురా. ఈ సీరియళ్లన్నీ ఇప్పుడు మంచి రసపట్టులో ఉన్నాయి. ముగింపెలా వుంటుందో కూడా ఊహించలేనంత సస్పెన్స్‌లో కొనసాగుతున్నాయి. వీటిని చూడకుండా చావడమంటే ఎంతో బాధగా ఉందిరా. అంతేకాదు, ఇప్పుడిప్పుడే దాసరి గారి అభిషేకం, సావిరహే సీరియల్స్, నేను అభిమానించే బాలచందర్‌గారి నీ పేరే నా ప్రేమ కొత్తగా ప్రారంభమయ్యాయి. ఇంకా కొన్ని కొత్త సీరియల్స్ రాబోతున్నాయని అనౌన్స్ చేసారు. వాటన్నింటినీ చూడాలని ఉందిరా" సీతారామయ్యగారి కంఠంలో దుఃఖం చోటు చేసుకుంది.



# లవ్లీ ప్రియమణి

కళ్లను కట్టిపడేసే అందం ప్రియమణిది. నటనలో కూడా మంచి మార్కులే కొట్టేసిన ఆమెకు ఆఫర్లు బాగానే ఉన్నాయి. 'పెళ్లైన కొత్తలో' చిత్రంలో లవ్లీగా కనిపించే ఆమె ఎక్స్‌పోజింగ్ కూడా రెడీ అంది. చాలారోజుల తరువాత ఇప్పుడు మళ్లీ ఎక్స్‌పోజింగ్‌కి సై అంటోంది. నితిన్ హీరోగా నటిస్తున్న 'ద్రోణ' చిత్రంలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోడానికి అందాలు అరబోస్తోందని సినీ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నారు.




"సీతారాముడూ! బాధ పడకురా. మనిషికి చావుందిగానీ సీరియల్స్‌కి చావులేదురా. ఏం చేస్తాం చెప్పు... ఇద్దరం కాటికి కాళ్లు చాపుకుని కూర్చున్నాం. పిలుపు ఎప్పుడు వస్తుందో అప్పుడు పోవాల్సిందే. మనం పోతే మాత్రమేం మన ఆత్మలు చూడవా ఏమిటి? ఆత్మలకు చావు లేదుగా. నువ్వు పోయినా నీ ఆత్మ సీరియల్స్ చూస్తుంది. నీకోసం నేను మీ ఇంట్లో రోజంతా టీవీ పెట్టి వుంచుతాను. నీ ఆత్మ దాన్ని చూస్తుంది. నువ్వు చేయ లేని పని నీ ఆత్మ చేస్తుంది. నువ్వింక నిశ్చింతగా ఉండు"

"అంతేనంటావా?" అన్నారాయన నీరసంగా.

"అంతకంటేం చేస్తాం చెప్పు"

అప్పటికే చీకటి పడిపోయింది.

అక్కడున్న వాళ్లలో చాలామంది వీళ్ల గురించే జోకులేసుకుంటున్నారు. సీతారామయ్యగారి పిల్లలు వచ్చిన తరువాత రావొచ్చులే అని కొంతమంది ఇళ్లకు పోయారు.

షామియానాలో లైటు బిగించారు.

"ఒరే నారాయణా! నాకిప్పుడు టీవీ చూడాలని ఉందిరా. మనం రెగ్యులర్‌గా చూసే సీరియల్స్ వచ్చే టైమ్ అయిందిరా" నెమ్మదిగా అడిగారు సీతారామయ్యగారు.

"ఇప్పుడెలాగురా? నువ్వు ఇంట్లోకి వెళ్లలేవుగా?"

"ఎవరికైనా చెప్పి టీవీని నా మంచం దగ్గర పెట్టించరా?"

ఆదినారాయణగారికేం చేయాలో తోచలేదు. ఎవరికైనా చెబితే ఏమను కుంటారో అనిపించింది.

కానీ వీడు చివరి కోరిక కోరుతున్నాడు. అదే చెప్పి కొంతమంది సాయంతో మంచం దగ్గర టేబుల్ వేయించి దానిమీద టీవీ పెట్టి కనెక్షన్ ఇప్పించారు.

వణుకుతున్న చేతితో రిమోట్ పట్టుకుని టీవీ ఆన్ చేసారు. ఆయనకు ఇష్టమైన సీరియల్ వస్తోంది. ఆయన ముఖంలో ఆనందం చోటు చేసు కుంది. అయితే ఆయన పూర్తిగా కళ్లు తెరిచి చూడలేకపోతున్నారు. అయినా అడ్వర్టయిజ్‌మెంట్లు వస్తున్నప్పుడు ఛానల్స్ మార్చి మిగతా సీరియల్స్‌ని అతికష్టంమీద చూస్తున్నారు.

★★★

రాత్రి ఎనిమిదిన్నర సమయంలో రెండు కార్లు వచ్చి ఇంటి ముందు ఆగాయి. అందులోంచి సీతారామయ్యగారి ఇద్దరు కొడుకులు, కోడళ్లు, మరో కారులోంచి వైజాగ్‌లో వున్న కూతురు, అల్లుడు దిగారు. మద్రాస్‌లో వున్న కూతురు ఇంకా రాలేదు.అంతా ఆయన మంచం దగ్గరకు కంగారుగా వచ్చారు. వాళ్ల ముఖాల్లో ఆందోళన ఏమయ్యిందోనని.

తీరా అక్కడికి వచ్చి చూసేసరికి వాళ్లకి మతిపోయింది. మంచంమీద పడుకున్న సీతారామయ్యగారి ఒక చేతికి సెలైన్ కట్టి వుంది. మరో చేతిలో రిమోట్ వుంది. దాని బటన్స్‌ని ఆయన ఓపిక తెచ్చుకుని నొక్కుతున్నారు. ఆయన్ని చూసి వాళ్లకి నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు.

టీవీలో మాత్రం 'విరిసే... మొగలి రేకులు' అంటూ టైటిల్ సాంగ్ వస్తోంది.

★